జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 29 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 4

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**టేకులపల్లి, ఏప్రిల్28, ప్రజాజ్యోతి:** మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోలు పక్కన సమగ్రంగా పరిశీలించారు.కొనుగోలు కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన ధాన్యం నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా స్వీకరిస్తు న్నారా

మిగతా 2 లో...




## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 28,(ప్రజా జ్యోతి)** జిల్లాలో నిర్వహించనున్న నీట్ (యూజీ)-2026 ప్రవేశ పరీక్షను ఎలాంటి లోపాలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 3వ తేదీ (ఆదివారం) మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నిర్వహించనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 1078 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానుండగా, ఇందు కోసం మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణి ఉమెన్స్ కళాశాల, శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల, నవభారత్ ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి ఎదురుగా గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులను ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. బయోమెట్రిక్ హాజరు, రిజిస్ట్రేషన్, భద్రతా తనిఖీల దృష్ట్యా అభ్యర్థులు ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు పైన తప్పనిసరిగా ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో అతికించుకోవాలని, అదనంగా మరో ఫోటోతో పాటు

మిగతా 2 లో...

## కాసుల కోసమే.. కృత్రిమ కొరత



- పగలు 'నో స్టాక్'... రాత్రి బ్లాక్ మార్కెట్ విక్రయాలు!
- పెట్రోల్ బంకుల్లో కృత్రిమ కొరతపై ఆరోపణలు
- ఒక్క రోజులోనే వేల లీటర్ల ఇంధనం గల్లంతు

**ములకలపల్లి, ఏప్రిల్ 28, ప్రజా జ్యోతి:** మండలంలోని పలు పెట్రోల్ బంకుల్లో పగలు 'నో స్టాక్' అంటూ వినియోగదారులను తిరస్కరించి, రాత్రివేళల్లో భారీ స్థాయిలో ఇంధనాన్ని బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీని వల్ల కృత్రిమ కొరత ఏర్పడి, సాధారణ ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.సోమవారం ఒక్కరోజులోనే ములకలపల్లి భారత్ పెట్రోల్ బంకులో సుమారు 12 వేల లీటర్ల డీజిల్, 5 వేల లీటర్ల పెట్రోల్, అలాగే జగన్నాథపురం హెచ్ పీ బంకులో 9 వేల లీటర్ల డీజిల్, 5 వేల లీటర్ల పెట్రోల్ పూర్తిగా ఖాళీ అయినట్లు సమాచారం. సాధారణ వినియోగదారులకు కాకుండా, భారీగా కొనుగోలు చేసే వ్యక్తులకు

మిగతా 2 లో...

## రైతు పండించిన ప్రతి గింజను కొనాలి: ఎమ్మెల్యే కూనంనేని

- మొక్కజొన్న కొనుగోలు కేంద్రం మంగళవారం ప్రారంభం



**సుజాతనగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 28:** రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, అన్నదాతలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండల కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం

మిగతా 2 లో...

## సాగు భూమి రైతులపై సింగరేణి దౌర్జన్యం

- 29 రైతు కుటుంబాల జీవనాధారం ప్రమాదంలో
- 60 ఏళ్లుగా సాగు చేస్తున్న రైతులు రోడ్డున పడే పరిస్థితి
- సింగరేణి చర్యలతో చిన్న రైతుల భవిష్యత్తు చీకటిలోకి
- భూమి కోల్పోతే జీవనం ఎలా అన్న ఆందోళన
- రైతుల గోడు వినేవారెవరు?



**కొత్తగూడెం, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి):** కొత్తగూడెం పరిసర ప్రాంతాల్లో సింగరేణి సంస్థ చేపట్టిన భూముల సర్వే ప్రక్రియ రైతు కుటుంబాల్లో తీవ్ర ఆందోళనకు దారి తీస్తోంది. సుమారు 60 ఏళ్లుగా తమ జీవనాధారంగా సాగు చేసుకుంటున్న భూములను ఒక్కసారిగా కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో రైతులు భవిష్యత్తుపై భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం, ఉమ్మడి చాతకొండ గ్రామపంచాయతీ పరిధిలో రైతులు రోడ్డున పడే పరిస్థితులు సింగరేణి చర్యల వల్ల ఏర్పడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరతరాలుగా సాగు చేస్తున్న ఈ భూములే తమకు అన్నం పెట్టాయని ఇప్పుడు అదే భూమిని కోల్పోతే కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని బాధిత రైతులు చెబుతున్నారు. భూమి తప్ప తమకు మరో జీవన మార్గం లేదని ప్రభుత్వం మరియు సింగరేణి యాజమాన్యం తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని కోరుతున్నారు. సర్వే పేరుతో భూములను స్వాధీనం చేసుకునే చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో

మిగతా 2 లో...

## నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

(మొదటి పేజీ తరువాయి...)

తాజా ఫోటో ఉన్న గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పర్సులు, వాచీలు, బెల్టులు, చైన్లు, ఇయర్ రింగ్స్, బ్యాంగిల్స్, రింగులు వంటి వస్తువులు అనుమతించబడవని స్పష్టం చేశారు. అభ్యర్థులు నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163(బి) అమలు చేయాలని, కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణను కట్టుదిట్టం చేయాలని, ప్రశ్నాపత్రాల రవాణా , పరీక్ష అనంతరం జవాబు పత్రాల భద్రత కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు ఏర్పాటు చేసి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. పరీక్షా రోజున విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఈ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైనదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, పాల్వంచ సీఐ సతీష్, జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ, కలెక్టరేట్ సూపర్డెంట్ వెంకటేశ్వర్లు, నీట్ పరీక్ష ఇంచార్జ్ ప్రసాద్, పరీక్షా కేంద్రాల సూపర్డెంట్లు, తాసిల్దారులు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, విద్యుత్ శాఖ అధికారులు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన ప్రతి గింజను కొనాలి: ఎమ్మెల్యే కూనంనేని

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న సాగు చేసిన రైతులు నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను వేగవంతంగా ప్రారంభించిందన్నారు. గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతుల ఖాతాల్లోకే నేరుగా నగదు జమ చేయాలని పేర్కొన్నారు.కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని, తూకాల్లో ఎలాంటి తేడాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవడం యంత్రాంగం బాధ్యత అని అన్నారు. రైతులకు తగిన ప్రతిఫలం దక్కినప్పుడే వ్యవసాయం పండుగలా మారుతుందని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతు సంక్షేమమే కీలకమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు భూక్యా దస్రు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు, సర్పంచ్ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో ఉపాధి హామీ కార్మికులు జాగ్రత్తలు తప్పనిసరి

- **సీతారాంపురం సర్పంచ్ అనిత**



**పిన పాక , ఏ ప్రిల్ 28(ప్రజాజ్యోతి):** మ ండుతున్న ఎండల నేపథ్యంలో ఉపాధి హామీ కార్మికులు త ప్పనిస రిగా రక్షణ చర్యలు పాటించాలని సీతారాంపురం గ్రామ సర్పంచ్ అనిత సూచించారు. గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన సందర్భంగా ఆమె కార్మికులతో మాట్లాడారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కార్మికులు ఉదయం త్వరగా పనులు ప్రారంభించి, మధ్యాహ్నం ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. పని చేసే సమయంలో తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, తరచుగా నీరు తాగడం, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు ఉపయోగించడం ద్వారా వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని తెలిపారు. అలాగే పనిస్థలాల్లో తాగునీరు, నీడ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఎండ వల్ల అస్వస్థతకు గురైనట్లయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలని కార్మికులకు సూచించారు. కార్మికుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ అనిత పిలుపునిచ్చారు. అనంతరం కార్మికులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సెక్రటరీ ఉపేందర్, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు

# సాగు భూమి రైతులపై సింగరేణి దౌర్జన్యం





(మొదటి పేజీ తరువాయి...)

చిన్న రైతుల పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే స్థానిక బాధిత రైతు కుటుంబాలు భూములు కోల్పోయే భయంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉన్నదని రైతు కుటుంబ జీవనం పూర్తిగా దెబ్బతింటుందని స్థానికులు చెబుతున్నారు. తమకు న్యాయం చేయాలనీ వేడుకుంటున్నారు.

**››› 60 ఏళ్ల సాగు భూములపై సింగరేణి దౌర్జన్యం: నిమ్మగడ్డ లక్ష్మణ్ రావు, రైతు**



1965 నుంచే తాము ఈ ప్రాంతంలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నామని స్థానిక రైతు నిమ్మగడ్డ లక్ష్మణ్ రావు తెలిపారు. ఉమ్మడి చాతకొండ పరిధిలోని సాటివారిగూడెంలో సుమారు 29 రైతు కుటుంబాలు ఈ భూములపై ఆధారపడి జీవిస్తున్నాయని చెప్పారు. ఇక్కడ ప్రధానంగా కూరగాయలు, క్యాబేజి పండిస్తుండగా, అదనంగా మొక్కజొన్న, నిమ్మ తోటలు, ములక్కాడ తోటల ద్వారా జీవనం సాగిస్తున్నామని వివరించారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత ఇప్పుడు సింగరేణి అధికారులు ఈ భూమి తమదని పేర్కొంటూ రైతులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 1971లోనే ప్రభుత్వం కరెంట్ మోటార్లు మంజూరు చేసి, పొలాలకు విద్యుత్ సౌకర్యాలు కల్పించిందని తెలిపారు. ఇప్పటికీ తమ వద్ద కరెంట్ బిల్లులు ఉన్నాయని, కొన్ని భూములకు పాస్ పుస్తకాలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. అదేవిదంగా మంత్రులను, స్థానిక ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వినిపించినట్లు బాధిత రైతులు తెలిపారు. రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

**››› తరతరాలుగా సాగు చేస్తున్న భూమి లాక్కుంటున్నారు: మేకల చంద్రకళ, మహిళా రైతు**



తరతరాలుగా దాదాపు 60 ఏళ్లుగా తమ కుటుంబాలు ఈ భూములపై కూరగాయల పంటలు, సాగు చేస్తూ జీవిస్తున్నామని స్థానిక మహిళా రైతు మేకల చంద్రకళ తెలిపారు. ఈ భూములే తమ కుటుంబాలకు జీవనాధారమని ప్రస్తుతం సింగరేణి అధికారులు జేసీబీలతో వచ్చి భూములపై చర్యలు చేపడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తమ వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించే అవకాశం ఇవ్వకపోవడంతో కొంత మంది రైతుల సాగు ఇప్పటికే నష్టపోయిందని పేర్కొన్నారు. వంగ తోటలు, నిమ్మ తోటలు, ములక్కాడ తోటలు తదితర పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితి కొనసాగితే చిన్నరైతు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంటుందని తమ జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

## కాసుల కోసమే.. కృత్రిమ కొరత

(మొదటి పేజీ తరువాయి...)

బంకు యజమానులు ఇంధనాన్ని సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



**››› జగన్నాథపురం బంకులో అర్ధరాత్రి అక్రమ కార్యకలాపాలు**

సోమవారం రాత్రి 9 గంటలకే 'డీజిల్ నో స్టాక్' అంటూ బంకును మూసివేసిన యాజమాన్యం, అర్ధరాత్రి 1 గంట నుంచి ఉదయం 5 గంటల వరకు క్యాన్లలో డీజిల్ నింపి బ్లాక్ మార్కెట్ కు తరలించినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. వీఐపీ సైరన్ తో వచ్చిన ఒక ప్రైవేట్ వాహనం సహా పలు వాహనాల్లో క్యాన్ల ద్వారా డీజిల్ ను తరలించినట్లు సమాచారం. అదే సమయంలో బంకు సిబ్బంది మేనేజర్ గది వెనుక నుంచి క్యాను లలో ఇంధనాన్ని బయటకు పంపినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. రాత్రి 9 గంటలకు స్టాక్ లేకపోయినా, అర్ధరాత్రి ఎలా అందుబాటులోకి వచ్చిందనే ప్రశ్నలు స్థానికుల నుంచి వెల్లువెత్తుతున్నాయి.

**››› తనిఖీలలో సిసి ఫుటేజీ చూపించని సిబ్బంది.**

ఈ ఘటనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తహసీల్దార్ మంగళవారం జగన్నాథపురంలోని శ్రీ రత్నాలమ్మ ఫిల్లింగ్ స్టేషన్ తనిఖీ చేశారు. అయితే, సిబ్బంది "ప్రస్తుతం స్టాక్ లేదు" అని చెప్పినట్లు తెలుస్తోంది. సీసీటీవీ ఫుటేజ్ చూపించాలని అడగగా, "మేనేజర్ లేరు, చూపించలేము" అని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. రికార్డులు తనిఖీ చేసి తహసీల్దార్ వెనుతిరిగినట్లు సమాచారం. అధికారులు స్పందించి, బంకు లో అర్ధరాత్రి జరిగిన అక్రమ విక్రయాల సంబందించిన స్టేట్మెంట్, సిసి ఫుటేజీ లు పరిశీలిస్తే నిజాలు బయటపడే అవకాశం కలదు. అధికారులు విచారణ జరిపి కృత్రిమ కోరత సృష్టిస్తున్న బంకు యజమానుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ భాగ్యలక్ష్మి వివరణ కోరగా, పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించామని తెలిపారు. స్థానిక రైతులు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ఇంధన విక్రయాలు నిర్వహించాలని బంకు యాజమాన్యానికి సూచించినట్లు చెప్పారు. కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)




అనే విషయంపై దృష్టి సారించి, సంబంధిత అధికారులను వివిధ అంశాలపై ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యంలో తేమ శాతాన్ని నిర్ధారించడానికి ఉపయోగిస్తున్న మాయిశ్చ రైజింగ్ యంత్రం పని తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతం నిర్ధారణంగా ఎలాంటి లోపాలు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సిబ్బందికి సూచించారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా పరీక్షించి వెంటనే ధాన్యం కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని సిబ్బందికి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలి అన్నారు.రైస్ మిల్లులకు ధాన్యాన్ని ట్యాపింగ్ విధానం, కొనుగోలు రిజిస్టర్ల నిర్వహణ, టోకెన్ పంపిణీ వ్యవస్థ పై సమగ్ర సమాచారం సేకరించడం జరిగిందని తెలిపారు. టోకెన్లను సమయానికి జారీ చేసి రైతులు అనవసరంగా వేచి ఉండకుండా ఎండ దెబ్బకు ప్రభావిత కాకుండా చూడాలని ఆయన తెలిపారు. ప్రతి రైతుకు పారదర్శకంగా సేవలు అందించాలని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రంలో సరైన రికార్డుల నిర్వహణ ఎంతో కీలకమని ఆయన తెలిపారు. ప్రతి రైతు వివరాలను నమోదు కచ్చితంగా ఉండాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రభుత్వం రైతులకు మద్దతుగా చేపట్టిన ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రతి రైతు లాభపడేలా చూడడం అధికారుల ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వీరభద్రం, డిసిసిబి సీఈవో చారి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో కుట్లు, అల్లికలు, చిత్రలేఖనం నేర్చుకోవాలి

- **గిరిజన విద్యార్థులతో భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు**



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 28 ప్రజా జ్యోతి** గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో చదువుతున్న గిరిజన ,విద్యార్థిని విద్యార్థులు వేసవి సెలవులలో ఇంటి పట్టునే ఉండకుండా సమ్మర్ క్యాంపు లలో ఉత్సాహంతో పాల్గొని మీకు ఇష్టమైన కుట్లు అల్లికలు చిత్రలేఖనం, క్రాఫ్ట్ ఆర్ట్స్ శ్రద్ధగా నేర్చుకొని మీలో దాగివున్న ప్రతిభను పదిమందికి తెలిసేలా చేసుకోవాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్‌రాజు అన్నారు. మంగళవారం భద్రాచలంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న సమర్ క్యాంపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మర్ క్యాంపు లో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు వారు ఎంచుకున్న చిత్రలేఖనం, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డాన్సింగ్ , కంప్యూటర్ శిక్షణతో పాటు వారిలో దాగివున్న ప్రతిభా పాటవాలను వెలికి తీసి వారికి ఇష్టమైన అంశాలను తప్పనిసరిగా నేర్పించాలని అన్నారు. కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులకు కంప్యూటర్లో వివిధ రకాల చిత్రాలతో పాటు దానికి సంబంధించిన వర్డ్స్ కూడా నేర్పించాలని అన్నారు. అలాగే బాలికలకు డాన్సింగ్ ఇతర భరతనాట్యాలతో పాటు కుట్లు అల్లికలు కూడా అర్థమయ్యేటట్లు ఫ్యాకల్టీలు నేర్పించాలని అన్నారు. సమ్మర్ క్యాంపులో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థిని విద్యార్థులు ఎండలో తిరగకుండా మీరు ఏ కోర్సును ఎంచుకుంటారో దానిని శిక్షకులు అందిస్తున్న అంశాలను క్షుణ్ణంగా గమనించి అర్థం కాకపోతే మరల అడిగి తెలుసుకుని సరదాగా నేర్చుకొని పరిణితి చెందాలని అన్నారు. సంబంధిత శిక్షకులు విద్యార్థినీ విద్యార్థులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చేటప్పుడు పిల్లల యొక్క కదలికలు గమనించాలని అన్నారు. అనంతరం కంప్యూటర్ చిత్రలేఖనం, డ్యాన్స్ క్లాసులను పరిశీలించి విద్యార్థిని విద్యార్థులకు కొన్ని సూచనలు ఇస్తూ వివిధ కోర్సులలో 15 రోజులపాటు అందించే ఈ శిక్షణలను సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా ప్రతి అంశం నేర్చుకోవాలని అన్నారు. అనంతరం సమ్మర్ క్యాంపుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సమ్మర్ క్యాంపులో విద్యార్థినీ విద్యార్థుల సంఖ్యను ఇంకా పెంచాలని హెచ్ఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఎంఓ రమేష్, జి సి డి ఓ అలివేలు మంగతాయారు, హెచ్ఎం సుభద్ర, శిక్షకులు సుజాత, నాగలక్ష్మి, మహాలక్ష్మి, ఆమని విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మ్యూజియం సందర్శించిన బీఈడీ కళాశాల విద్యార్థినిలు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 28, ప్రజాజ్యోతి ,** భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో శిక్షణ పొందుతున్న 200 మంది విద్యార్థినిలు ,అధ్యాపక బృందం సందర్శించారు. మంగళవారం నాడు బీఈడీ విద్యా ప్రణాళికలో ఒక అంశమైన ఫీల్డ్ ట్రిప్ లో భాగంగా గిరిజనుల నేపథ్యం వారి జీవన విధానం వారి యొక్క కళాకృతులు, వారి వృత్తులకు సంబంధమైనటువంటి అంశాలు వారి యొక్క సాంప్రదాయాలు తదితర అంశాలను అన్నిటిని ఒక వేదికగా పొందించబడినటువంటి గిరిజన మ్యూజియంను సందర్శించి అందులోని కళాఖండాలను ఆసక్తిగా తిలకించి అన్ని విషయాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారని అన్నారు. తరతరాలుగా గిరిజనుల జీవన విధానాన్ని ప్రతిబింబించే గిరిజన మ్యూజియంలో ఏర్పాటు చేసినటువంటి అనేక అంశాలు విద్యార్థినిలకు అధ్యాపక బృందాన్ని ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ సందర్భంగా బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ దుర్గాభవాని మాట్లాడుతూ బీఈడీ విద్యార్థులు వారి కోర్సులో భాగంగా ప్రతి విద్యా సంవత్సరం ఒక ఫీల్డ్ ట్రిప్ నిర్వహించాల్సి ఉందని అందులో భాగంగానే ఈ విద్యా సంవత్సరం విద్యార్థులను గిరిజన మ్యూజియంని సందర్శించడం జరిగింన్నారు. అనంతరం భోజన కార్యక్రమాలు ముగించుకొని అధ్యాపకులు విద్యార్థినిలు కలిసి ఆటపాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కోదండరాం ధనలక్ష్మి, రాంబాబు, నవీన్, హనుమంతరావు, ఉపేందర్, అరుణ, పరిహిన్, శ్రీనివాస్ మరియు బి.ఎడ్, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

# వినియోగదారుల సహకారంతో భద్రగిరి మార్ట్ విజయవంతంగా నడుస్తోంది

- **భద్రాచలం ఐటీడీఏ ఏ పీవో జనరల్ డేవిడ్‌రాజు**



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి ,** గిరిజన మహిళలు, ఎస్ హెచ్ జి గ్రూప్ మహిళల నిత్యవసర సరుకులు, ఆర్గానిక్ పంటలు పండించే గిరిజన రైతుల వ్యవసాయ ఉత్పత్తులు, జిసిసి ద్వారా అటవీ ఉత్పత్తులతో ఏర్పాటుచేసిన భద్రగిరి మార్ట్ వినియోగదారుల సహాయ సహకారాలతో విజయవంతంగా నడుస్తున్నదని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేసి నెల రోజులు అయిన సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూచనల మేరకు భద్రగిరి మార్ట్ లో ఎటువంటి కల్తీ లేని నిత్యవసర సరుకులు, ఆర్గానిక్ వ్యవసాయ ఉత్పత్తులు, ఎస్ హెచ్ జి, గిరిజన మహిళల ఉత్పత్తులు ప్రముఖులతోపాటు వినియోగదారులు భద్రగిరి మార్ట్ సందర్శించి కొనుగోలు చేస్తున్నందుకు వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. భద్రగిరి మార్ట్ ఏర్పాటు చేయడం వలన పలు కుటుంబాలకు జీవనోపాధి పెంపొందించుకోవడానికి ఉపాధి అవకాశాలు లభించాయని, ప్రజల ఆదరణ మరియు భద్రగిరి మార్ట్ లో లభించే నిత్యవసర సరుకులు నమ్మకముతో ప్రజలు కొనుగోలు చేయడంతో భద్రగిరి మార్ట్ యొక్క పేరు ప్రాచుర్యంలోకి రావడంతో త్వరలో బ్రాంచీలు కూడా ఏర్పాటు చేయడంతో పాటు నేరుగా కస్టమర్ల ఇండ్లకు హోం డెలివరీ ద్వారా సరఫరా చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని అన్నారు. అందుకు ప్రజలు తప్పనిసరిగా భద్రగిరి మార్ట్ సందర్శించి మార్ట్ లో లభించే నిత్యవసర సరుకులు సరసమైన ధరలకు కొనుగోలు చేసి భద్రగిరి మార్ట్ అభివృద్ధికి దోహదపడాలని ఆయన అన్నారు.

# బాల్య వివాహాలు జీవితాలను చిదిమేస్తాయి

- **చైల్డ్ వెల్ఫేర్ అధికారి అంబేద్కర్**

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 28 (ప్రజా జ్యోతి ):** బాల్యంలో ఆడపిల్లలకు చేసే వివాహాలు వారి జీవితాలను చిదిమేస్తాయని... తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం మానుకోవాలని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు అంబేద్కర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ పంచాయతీ కార్యాలయంలో ప్రజాపాలన –ప్రగతి ప్రణాళికలో భాగంగా బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులకు సర్పంచ్ మందా నాగరాజు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకాధికారి రవీంద్రఠాగూర్, ఎంపీడీవో జమలారెడ్డి, ఐసీడీఎస్ సీడీపీవో రేవతిలతో కలిసి మాట్లాడుతూ ఆడపిల్లలు యుక్తవయస్సుకు రాకుండానే చిన్నతనంలో బాల్య వివాహాలు చేయడం వల్ల అనారోగ్య సమస్యలు ఎదురుకావడంతో పాటు కుటుంబపరంగా ఎన్నో సమస్యలు ఎదురవుతాయన్నారు. ఇప్పటి విద్యార్థులే బాల్య వివాహాల పట్ల కలిగే అనర్థాలను, ఎదురయ్యే




సమస్యలను తల్లిదండ్రులకు వివరించాలని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు చిన్నతనంలో వివాహాలు చేయకుండా నివారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యదుసింహరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, డీఆర్డీఏ అధికారి నీలేష్, భజన సతీష్, పంచాయతీ, ఐసీడీఎస్, చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

# భద్రాచలంలో హిందూ సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 28 ,ప్రజాజ్యోతి ,** భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం జరగనున్న హిందూ సమ్మేళనంకు సంబంధించి కరపత్రాలను మంగళవారం నిర్వాహకులు పాకాల దుర్గాప్రసాద్, ఉత్సవ కమిటీ కార్యదర్శి ఎంవి సుబ్రమణ్యం, కోశాధికారి నాగభూషణశాస్త్రిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాకాల దుర్గాప్రసాద్ గారు మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం మరియు ధార్మిక విలువలను బలపరచడం ఈ సమ్మేళన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన సమన్వయ సమావేశాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించామని, ఇప్పుడు కరపత్రాల విడుదలతో గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రచారాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం భద్రాచలం నగర ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాగభూషణ శాస్త్రి, గోపి కిషోర్, ఎ. శ్రీనివాస రెడ్డి, జె. శ్రీనివాస రావు, అన్నపూర్ణ, సిద్ధార్థ, కుంజా సంతోష్ పాల్గొన్నారు.

# అంజన్నకు అభిషేకం...రామయ్యకు కల్యాణం



**భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి ,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా దాసాంజనేయస్వామి వారి ఆలయంలో అంజన్నకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఈ సమయంలో తమలపాకులతో ప్రత్యేక అర్చన జరిపారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం ను వైదిక బృందం నిర్వహించారు.

పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి

# సిపిఎం ఆధ్వర్యంలో నిరసన, మండల తహసిల్దార్ కు వినతి

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 28 ప్రజాజ్యోతి ,** భద్రాచలం పట్టణంలో గత రెండు, మూడు రోజులుగా పెట్రోల్ కొరతతో వాహన వినియోగదారులు, వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి,పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి లు డిమాండ్ చేశారు. సిపిఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పెట్రోల్ డీజిల్ కొరత నివారించాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అనంతరం మండల తహసీల్దార్ ధనియాల వెంకటేశ్వరరావుకు వినతి పత్రం అందించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పెట్రోల్, డీజిల్ కొరత నివారణకు చర్యలు చేపడతామని తహసిల్దార్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంబి నర్సారెడ్డి, గడ్డం స్వామిలు మాట్లాడుతూ భద్రాచలం పట్టణంలోని పలు పెట్రోల్ బంకు యజమానులు నో స్టాక్ బోర్డులు పెడుతున్నారని, కొన్ని బంకుల వద్ద వందలాది వాహనాలు బార్లు తీరి వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా వంట గ్యాసు తో పాటు వ్యాపారస్తులకు డొమెస్టిక్ గ్యాస్ సరఫరా సక్రమంగా అందకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.తక్షణమే ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి భద్రాచలం పట్టణంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతను నివారించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నకరికంటి నాగరాజు, అజయ్ కుమార్, కుంజా శ్రీనివాస్, ధనకొండ రాఘవయ్య, భూపేంద్ర, సీనియర్ నాయకులు ఎం వి ఎస్ నారాయణ, బి జె ఎల్ పి దాసు, ముత్తయ్య, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి రవీందర్, కొరసా రవి, కారు అడ్డ యూనియన్ నాయకులు సుబ్బారావు, ఖలీలు, భాష్యం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



## పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం

- బకాయిలు చెల్లించాలని డిమాండ్



**చర్ల, ఏప్రిల్ 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ చర్ల మండల శాఖ ఆధ్వర్యంలో సమావేశం శాఖా గ్రంథాలయ ఆవరణలో అధ్యక్షులు నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 5 డి.ఆర్‌లను వెంటనే ప్రకటించాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ చర్ల బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ మురళీధర రావు హాజరయ్యారు. ఆయన పెన్షనర్లు బ్యాంకు సేవలను సురక్షితంగా వినియోగించుకోవడం పై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆన్లైన్ మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచిస్తూ, తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే బ్యాంకును సంప్రదించాలని సూచించారు. అలాగే సీనియర్ సిటిజన్లకు బ్యాంకులో లభించే ప్రత్యేక సదుపాయాలను వివరించారు. ఈ సమావేశంలో సమితి గౌరవాధ్యక్షులు విస్సా . నాగభూషణం, ప్రధాన కార్యదర్శి పుచ్చల నరసింహారావు, ఉపాధ్యక్షులు ఆడెపు ముత్యాలరావు, కోశాధికారి సోల్లంగి నాగేశ్వరరావు, సీనియర్ పెన్షనర్ చింతూరి వెంకటేశ్వర రావు, ఆర్.వి. చక్రకుమారి , ఏ. శ్రీనివాసరావు, జే. నరేంద్ర బాబు, కల్లూరి ముత్తయ్య, సత్యనారాయణ, శ్యామల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## పట్టా పోడు భూములకు త్రీఫేస్ విద్యుత్ సర్వే



**చర్ల ,ఏప్రిల్ 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం ఆర్ కొత్తగూడెం పంచాయితి పరిధిలోని దానవాయిపేట గ్రామంలోని పట్టా పోడు భూములకు త్రీఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు విద్యుత్ శాఖ అధికారులు సర్వే నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చొరవతో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. విద్యుత్ శాఖ ఏఈ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని పట్టా పోడు భూముల్లో విస్తృతంగా పర్యటించారు. సర్వే అనంతరం ఈ ప్రాంతానికి త్రీఫేస్ కరెంట్ అందించేందుకు సుమారు 80 నుంచి 100 వరకు విద్యుత్ స్తంభాలు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడిన ఏఈ, ఒక్కొక్క కనెక్షన్‌కు సుమారు రూ.9,500 డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం డీడీలు చెల్లించిన వారి వరకు సర్వే కొనసాగుతోందని, త్వరలోనే అంచనా (ఎస్టిమేషన్) సిద్ధం చేసి అవసరమైన అనుమతులు పొందిన వెంటనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కృషి వల్లే తమ భూములకు విద్యుత్ సమస్య పరిష్కారం అవుతోందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. త్రీఫేస్ విద్యుత్ అందుబాటులోకి వస్తే పంటలకు నీరు అందించడంలో ఎంతో సహాయం కలుగుతుందని తెలిపారు. ఏళ్ల తరబడి ఉన్న తమ కల నెరవేరబోతుందనే ఆశాభావంతో ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ రాజా, కుంజా వెంకటేశ్వర్లు, కారం వెంకటేశ్వర్లు, కనితి నరసింహారావు, పాయం వెంకటేశ్వర్లు, నూపకృష్ణ, కాక రామారావు, కనితి నరేష్, కనితి కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిస్ట్రిక్ట్ పంచాయతీ అధికారిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన డిఆర్డిఓ విద్యాచందన



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 28, (ప్రజా జ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డిస్ట్రిక్ట్ పంచాయతీ అధికారి (డిపిఓ)గా డిఆర్డిఓ విద్యాచందన మంగళవారం అదనపు బాధ్యతలను అధికారికంగా స్వీకరించారు. జిల్లా కేంద్రంలో జరిగిన బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో అధికారులు పూల మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికలు విద్యతో ముందుకు సాగాలి

- సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి : జిల్లా కలెక్టర్ అంకిత్





**టేకులపల్లి, ఏప్రిల్ 28, ప్రజాజ్యోతి:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అమలు చేస్తున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో పిల్లల భద్రత వారోత్సవాల సందర్భంగా మండల స్థాయి సమీక్ష సమావేశం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం టేకులపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్ని, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతు బాలికలు విద్యపై పూర్తి దృష్టిసారించి తమ లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని ఆయన సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా క్రమశిక్షణతో ముందుకు సాగి తమ భవిష్యత్తును సక్రమంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వేసవి సెలవులను సృజనాత్మకంగా వినియోగిస్తూ సింగింగ్, పెయింటింగ్, డ్రాయింగ్ ఇతర రంగాల్లో నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. మొబైల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ సోషల్ మీడియాకు దూరంగా ఉండి సమయాన్ని వృథా చేయకుండా కెరీర్ అభివృద్ధి, నైపుణ్యాల పెంపుపై దృష్టి పెట్టాలని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండటం ప్రతి విద్యార్థికి ఎంతో అవసరమని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా కిషోర బాలికల కోసం నిర్వహించిన అవగాహన సదస్సులో డ్రగ్స్ దుష్ప్రభావాలు, వ్యక్తిగత భద్రత, ఆరోగ్య పరిరక్షణ అంశాలపై ఆయన వివరించారు. ఈ దశలో బాలికలు శారీరక, మానసిక మార్పులను ఎదుర్కొంటారని, అందువల్ల వారికి తగిన మార్గదర్శకత్వం, పోషకాహారం, మానసిక మద్దతు అవసరమని ఆయన పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బందికి మొబైల్ ఫోన్లు అందజేసి పోషణ ట్రాకింగ్ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. సురక్షిత బాలికల సాధనలో భాగంగా విద్య, ఆరోగ్యం, రక్షణ అంశాలపై సమగ్ర దృష్టి అవసరమని, ప్రతి బాలికకు భద్రమైన వాతావరణం కల్పించడం సమాజ బాధ్యత అని జిల్లా కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బాల్యవివాహాల నివారణపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో "బాల్య వివాహం బ్రతుకు ఆగం" గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం, బాల్యవివాహాలను ప్రోత్సహించబోమని పాల్గొన్న వారితో ప్రతిజ్ఞ చేయించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాల్యవివాహాల నిర్మూలనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. సఖి వన్ స్టాప్ సెంటర్ మొబైల్ అవగాహన కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి, ఆ కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలపై అవగాహన గోడ పత్రికను ఆవిష్కరించారు. పిల్లల భద్రతకు సంబంధించి అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే టోల్ ఫ్రీ నెంబర్ 1098 పోస్టర్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెంబర్ ద్వారా పిల్లలకు సంబంధించిన సమస్యలను వెంటనే అధికారులకు తెలియజేయవచ్చని, ప్రతి ఒక్కరూ ఈ సేవను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, ఎంపీడీఓ మల్లీశ్వరి, తాసిల్దారు వీరభద్రం, మండల స్థాయి అధికారులు, అంగన్వాడి సిబ్బంది, వైద్యశాఖ అధికారులు, కిశోర బాలికలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులు బాధ్యతతో వ్యవహరించి... ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- సీఐ తిరుపతి



**గుండాల. మార్చి 28. ప్రజా జ్యోతి** యువత విద్యార్థులు బాధ్యతతో వ్యవహరించి ఉన్నత శిఖరాలను సాధించాలని గుండాల సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీపతి తిరుపతి కోరారు మంగళవారం మండలంలోని ఏకలవ్య పాఠశాలలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మహిళల భద్రత ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ చైతన్యం, వేధింపులపై ప్రతి ఒక్కరూ అవగాహన చేసుకుని జాగ్రత్తగా ఉండాలన్నారు, కౌమర దశలో ఎదుర్కొనే పలు విషయాలను వివరించారు క్రమశిక్షణతో మంచి అలవాట్లను అలవర్చుకొని తద్వారా కుటుంబానికి గ్రామానికి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. సమాజంలో జరుగుతున్న నేరచరితలపై ఎప్పటికప్పుడు తగ్గిన అవగాహనతో ఉండాలని కోరారు.

## బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఆత్మహత్య



**చర్ల, ఏప్రిల్ 28: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో మంగళవారం సత్యనారాయణపురంలో విషాద ఘటన చోటుచేసుకుంది. పెద్దపల్లి గ్రామంలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గోసు ఉదయ్ కిరణ్ (20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేవలం 20 ఏళ్ల వయసులోనే యువకుడు ఈ దారుణ నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంసమైనది . ఆయన ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదు. సమాచారం అందుకున్న చర్ల ఎస్ ఐ నర్సిరెడ్డి ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నట్లు తెలియజేశారు.

## కొత్తగూడెం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సుచరితకు ఘన వీడ్కోలు




**కొత్తగూడెం, ఏప్రిల్ 28 ( ప్రజాజ్యోతి )** ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి-కమ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్‌గా విధులు నిర్వహించిన శ్రీమతి ఎ. సుచరిత బదిలీ సందర్భంగా స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లైబ్రరీ హాల్‌లో ఘనంగా వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి. ప్రేమలత ముఖ్య అతిథిగా హాజరై సుచరిత సేవలను కొనియాడారు. న్యాయపరమైన బాధ్యతలను ఆమె నిబద్ధతతో నిర్వహిస్తూ న్యాయవ్యవస్థ గౌరవాన్ని నిలబెట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో I అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీమతి ఎస్. సారిత, సీనియర్ సివిల్ జడ్జి-కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీ కిరణ్ కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి-కమ్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి శ్రీమతి కవిత, II అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ రవి కుమార్, III అదనపు జూనియర్ సివిల్ జడ్జి-కమ్ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీ వినయ్ కుమార్ పాల్గొన్నారు. సుచరిత తమ పదవీకాలంలో బార్ సభ్యులతో స్నేహపూర్వకంగా వ్యవహరించి మంచి గుర్తింపు పొందారని వక్తలు తెలిపారు. బార్ అసోసియేషన్ తరపున శాలువా, పుష్పగుచ్ఛం, స్మారక చిహ్నం తో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ సాజహాన్ పర్వీన్, కాటూరి సంజీవరావు, ప్రధాన కార్యదర్శి గడిపల్లి మహేష్, జాయింట్ కార్యదర్శి గడదాసు నాగరాజు, క్రీడా కార్యదర్శు లు బానోత్ దేవదాస్, నకరాకంటి ఉమ, గ్రంథాలయ కార్యదర్శి దొడ్డా ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే సీనియర్ న్యాయవాదులు వై. బాబు రావు, పి. సాంబశివరావు, నాగిరెడ్డి, ఉదయ్ భాస్కర్, వి.వి. సుధాకర్, రమేష్ కుమార్ మక్కడ్, ఎ. రామ్ ప్రసాద్, వెల్లంకి వెంకటేశ్వర్లు, వై. రామారావు, కె. పుల్లయ్య, పురుషోత్తం, జి. రామూర్తి, వేల్పుల సుధాకర్, మహిళా న్యాయవాదులు మనోరమ, సునంద, భానుప్రియ తదితరులు, జూనియర్, సీనియర్ న్యాయవాదు లు, బార్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

